క్లుప్తంగా

అభినందన



విద్యార్థిని రూపశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బీఎస్సీ ఫిజిక్స్ హానర్స్ రెండో సంవత్సరం విద్యార్థిని రూపశ్రీ వ్యాసరచన, డిబేట్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ తెలిపారు. ఈనెల 4న కడప ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ (మెన్)లో సమాచార హక్కు చట్టం–2005 చట్టం ఏర్పడి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, డిబేట్ పోటీల్లో రూపశ్రీ పాల్గొని ప్రథమ బహుమతులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం విద్యార్థిని రూపశ్రీని కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

విశ్వనాథరెడ్డికి పరామర్శ



విశ్వనాథరెడ్డిని పరామర్శిస్తున్న నాయకులు

పోరుమామిళ్ల : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి వైరల్ ఇన్‌ఫెక్షన్ కారణంగా విజయవాడ ఆయుష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. 10 రోజులుగా తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతూ స్థానిక వైద్యులతో చికిత్స పొందినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో విజయవాడ వెళ్లారు. సమాచారం తెలిసి ఉప సర్పంచ్ రాళ్లపల్లె రవికుమార్, మాజీ సర్పంచ్ భూతప్ప, నాయకులు హబీబ్, రఘురాములు, నాయబ్ రసూల్, రమణయ్య తదితరులు గురువారం విజయవాడ వెళ్లి ఆయన్ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

డీపీఎంఓగా శంభుప్రసాద్



బద్వేలు అర్బన్ : కుష్టు వ్యాధి నిర్మూలన విభాగం తొట్టిగారి పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్‌గా బలపనూరు శంభుప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో పనిచేస్తుండే ఈయన ఇటీవల జరిగిన బదిలీల్లో తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ డీపీఎంఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, కుష్టువ్యాధిగ్రస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేస్తానని తెలిపారు.

డీకేటీ భూముల పరిశీలన



గంగయ్యపల్లె వద్ద డీకేటీ భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

కలసపాడు : మండలంలోని గంగాయపల్లె వద్ద ఉన్న డీకేటీ భూములను గురువారం బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ పరిశీలించారు. పలువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఆర్డీఓ డీకేటీ భూములను పరిశీలించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భూములకు సంబంధించిన అర్జీలు వస్తే త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ మధురవాణిని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ మోహన్ రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి రాఖీ కట్టిన ఓం శాంతి అక్కయ్య



ఎమ్మెల్సీకి రాఖీ కడుతున్న ఓంశాంతి అక్కయ్య

పోరుమామిళ్ల : రేపు (శనివారం) రాఖీ పౌర్ణమిను పురస్కరించుకొని గురువారం పోరుమామిళ్లలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి ఓం శాంతి అక్కయ్య స్వప్న రాఖీ కట్టారు. సర్వమానవ సౌభ్రాతృత్వానికి రాఖీ అద్దం పడుతుందన్నారు. రాఖీ అన్నా చెల్లెళ్ల అనుబంధమే కాక సమస్త ప్రజలు ఒకరికొకరు అండగా, రక్షణగా నిలవాలన్నదే రాఖీ సందేశమని ఓం శాంతి అక్కయ్య వివరించారు. అనంతరం ఆమె పట్టణంలోని ప్రముఖులకు రాఖీ కట్టారు.

సదుపాయాలు ఉండాలి

జమ్మలమడుగు : ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులకు యాజమాన్యం మౌలిక సదుపాయాలను కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీత తెలిపారు. గురువారం ఆమె ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో నిబంధనల ప్రకారం ఉన్నాయా లేదా అనే విషయంతో పాటు ఫైర్, బయోమెడికల్ వేస్టేజి, పొల్యూషన్‌లకు కాలపరిమితి, ఆసుపత్రికి వచ్చే రోగులకు మరుగుదొడ్లు, తాగునీరు తగినంత సిబ్బంది ఉన్నారా అన్న విషయంపై ఆరాతీశారు.

మార్కెట్లు కళకళ



శివాలయం సమీపంలో పూజా సామాగ్రిన్ని కొనుగోలు చేస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని పలు ఆలయాలతోపాటు ఇంటి వద్ద కూడా ఈ వ్రతాన్ని ఆచరించేందుకు భక్తులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో సామూహికంగా భక్తులు వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించనున్నారు. వరలక్ష్మీవ్రతం సందర్భంగా స్థానిక శివాలయం వీధి, కొర్రపాడు రోడ్డులోని మార్కెట్ వద్ద గురువారం కొనుగోలుదారులతో సందడి నెలకొంది. వరలక్ష్మీ అమ్మ వారి ప్రతిమతోపాటు పూలు, పండ్లు, అరటి పిలక, టెంకాయలు తదితర వాటిని భక్తులు కొనుగోలు చేశారు. సాధారణంగా కంటే ధరలు పెరిగాయి.

మరమగ్గాలను అందించకపోవడం దురదృష్టకరం



మాట్లాడుతున్న బీజేపీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు

ప్రొద్దుటూరు క్రైం : రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేనేతలకు సబ్సిడీతో మరమగ్గాలను సరఫరా చేయకపోవడం దురదృష్టకరమని ప్రొద్దుటూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు తెలిపారు. చేనేత దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నాటక రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి 80 శాతం సబ్సిడీతో చేనేత కార్మికులకు మరమగ్గాలను సరఫరా చేసిందన్నారు. అయితే మన రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉన్నా మరమగ్గాలకు సంబంధించిన ప్రతిపాదన ఏదీ చేయకపోవడం దురదృష్టకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు సుబ్రమణ్యం, పలువురు చేనేత నాయకులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే రమేష్‌యాదవ్‌పై దాడి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ రాఘవరెడ్డి

ఖాజీపేట : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు దాడులకు తెగబడుతున్నారని, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై టీడీపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి, ఖాజీపేట మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి అన్నారు. ఖాజీపేటలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రచారం చేసుకోవడం సర్వసాధారణమన్నారు. ఎక్కడికైనా వెళ్లి పార్టీ తరుపున ప్రచారం చేసుకోవచ్చునని తెలిపారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అధికార యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు లాంటవని తప్పుబట్టారు. దాడులు, బెదిరింపులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. రెట్టింపు ఉత్సాహంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేస్తారని పేర్కొన్నారు. కూటమి పాలనను ప్రజలు గమనిస్తున్నారని, రాబోవు ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న డాక్టర్ నరసింహారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకోవాలని డాక్టర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 6వ తరగతి విద్యార్థులకు ఆయన నెల రోజుల పాటు ఉచితంగా హ్యాండ్ రైటింగ్‌లో శిక్షణ ఇచ్చి పోటీ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలో విద్యార్థులకు మంచి చేయాలనే ఉద్దేశంతో చేతిరాత నిపుణులతో ఉచితంగా హ్యాండ్ రైటింగ్‌లో శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు అందమైన చేతి రాత ఉంటేనే మార్కులు బాగా వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గీత, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కాశీ ప్రసాదరెడ్డి, సుధాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిశువుకు సంపూర్ణ ఆహారం తల్లిపాలు



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న డాక్టర్ నరసింహారెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : శిశువుకు సంపూర్ణ ఆహారం తల్లిపాలు అని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా తెలిపారు. గురువారం మండలంలోని చౌడూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం ఎంతో ఆరోగ్యమని అన్నారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే శిశువుకు సంపూర్ణ ఆహారమని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రదర్శన నిర్వహించి ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, సీహెచ్‌ఓ గౌతమి, ఏఎన్‌ఎం అరుణ దీప్తి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారం అండతోనే టీడీపీ మూకల దాడులు



మాట్లాడుతున్న ఆదిత్యారెడ్డి

పోరుమామిళ్ల : పులివెందుల రూరల్ మండల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో ఎలాగైనా గెలవాలనే ఆలోచనతో టీడీపీ మూకలు దాడులకు తెగబడుతున్నాయని రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పులివెందులలో గెలిచేందుకు అలజడులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పదుల సంఖ్యలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నా వాటికి ఎన్నికలు నిర్వహించకుండా చంద్రబాబు నాయుడు ఏరికోరి కడప జిల్లాలో రెండు జెడ్పీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారన్నారు. అప్రజాస్వామిక పద్ధతులకు తెరలేపుతూ ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి గెలవాలని ధోరణి అవలంబించడాన్ని ఖండించారు. చుట్టుపక్కల జిల్లాలకు చెందిన టీడీపీ గూండాలను పులివెందులలో మోహరించి, అధికారాన్ని అడ్డుపెట్టుకొని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా దాడులు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మండల నాయకుడు వేల్పుల రాములుపై కర్రలు, కత్తులతో దాడి చేయడం అమానుషమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులకు లేదా? అని ప్రశ్నించారు.

మానవసేవ పరమాత్ముని సేవ



మాట్లాడుతున్న ఈవీ మహేశ్వర్‌రెడ్డి

ఖాజీపేట : మానవసేవ పరమాత్ముని సేవగా ప్రతిఒక్కరూ భావించాలని కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ అధ్యక్షుడు ఈవీ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఖాజీపేటలోని సాయిబాబా ఆలయంలో మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. పరులకు సేవ చేయటం కర్తవ్యంగా భావిస్తూ ఎంతోమంది పేదలను అక్కున చేర్చుకుని వారి కష్టాలను తీరుస్తున్న మానవతాసంస్థ సభ్యులు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. తన వంతుగా సంస్థకు ఒక ఫ్రిజర్ బాక్స్ ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ సాంబశివారెడ్డి మాట్లాడుతూ సమాజంలో మనుషుల మధ్య పెరుగుతున్న అంతరాల క్రమంలో ఇలాంటి సంస్థలు అందిస్తున్న సేవలు మనుషుల సత్సంబంధాలు పెంపొందుతాయన్నారు. ప్రతిఒక్కరూ మానవతా సంస్థకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాహిత్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సంజీవ్‌రెడ్డి, గంగవరం ఆదినారాయణరెడ్డి, చైతన్య స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, రామాంజులరెడ్డి, గోపి, డాక్టర్ సుబ్బారెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల వేధింపులు ఆపాలి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సుబ్బారెడ్డి భార్య, కుమార్తెలు

బ్రహ్మంగారిమఠం : టీడీపీ నాయకుల వేధింపులు ఆపాలని అఖిలపక్ష నాయకులు కోరారు. మండలంలోని లింగాలదిన్నెపల్లె గ్రామానికి చెందిన లెక్కల వెంకటరమణారెడ్డి (మాజీ వైస్ ప్రెసిడెంట్) అదే గ్రామానికి చెందిన భూమిరెడ్డి సుబ్బారెడ్డిని భూ వివాదంలో వేధిస్తున్నారని అఖిలపక్ష నాయకులు తెలిపారు. గురువారం అఖిలపక్ష నాయకులు సుబ్బిరెడ్డి ఇంటికి వెళ్లి కటుంబసభ్యులతో మాట్లాడారు. అనంతరం వారు బి.మఠం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.నారాయణ మాట్లాడుతూ పొలానికి దారి విషయంలో కొంతకాలంగా వెంకటరమణారెడ్డి, సుబ్బారెడ్డి మధ్య వివాదం జరుగుతోందని తెలిపారు. అయితే వెంకటరమణారెడ్డి అధికార పార్టీ అండతో సుబ్బారెడ్డి కుటుంబపై దౌర్జానికి దిగడంతో సోమవారం ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. కుటుంబసభ్యులపై కూడా దాడి చేశారని తెలిపారు. తక్షణం వెంకటరమణారెడ్డితో పాటు దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బి.మఠం పోలీసులు కేసు నమోదు చేయకపోతే జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు. సుబ్బారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్, సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యులు శ్రీరాములు, బీఎస్పీ నాయకుడు గుర్రప్ప పాల్గొన్నారు.

మాదిగలకు 7 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ

ప్రొద్దుటూరు : మాదిగలకు 7 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పేర్కొన్నారు. ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యకర్తల సమావేశాన్ని గురువారం ఎన్జీఓ హోంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగల సామాజిక వర్గానికి పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని, వర్గీకరణ ద్వారా ఉద్యోగం పొందిన మాదిగ సామాజిక వర్గం వారు ఒకరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ కోసం 35 ఏళ్లుగా మాదిగలు అవిశ్రాంత పోరాటం చేశారని పేర్కొన్నారు. 7 శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడే వారికి పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందని, ఈ రిజర్వేషన్ కోసం గ్రామ స్థాయి నుండి కమిటీలు వేసి ఉద్యమించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాలలక్ష్మయ్య మాదిగ, రాష్ట్ర డప్పు కళాకారులు, చర్మకారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం మాదిగ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన



పంట సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని నంగనూరుపల్లె గ్రామంలో గురువారం వ్యవసాయశాఖ, ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో రైతు గుర్రప్ప పొలంలో గ్యాప్ పొలంబడి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ చెన్నకేశవులు మాట్లాడుతూ పంట నాటిన దశ నుండి పంట కోత వరకు వివిధ దశలలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పంటలకు మితిమీరిన రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకూడదన్నారు. పంటలో పిలకల సంఖ్యను లెక్కకట్టడం, బ్యాలెట్ పరీక్ష నిర్వహించి పంట తెగుళ్లు, పురుగుల మీద అవగాహన కల్పించామన్నారు. వీఏఏ శివశంకర్ మాట్లాడుతూ వరిలో ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల దూరంలో కాలిబాటలు వేసుకోవాలన్నారు. దీని వలన పంటకు గాలి, వెలుతురు బాగా తగులుతుందన్నారు.

కూటమి పాలనలో దివాళా దిశగా రాష్ట్రం



ఇంటింటి ప్రచారంలో నాగార్జునరెడ్డి, నాయకులు

పోరుమామిళ్ల : అధికారంలోకి రాకముందు సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నాడని, రాష్ట్రం దివాళా దిశగా పయనిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా అక్కలరెడ్డిపల్లె, నాగలకుంట్ల పంచాయతీల్లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ బాబు వాగ్దానాలను నమ్మి మోసపోయామని ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత ఒక్క వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవి, సర్పంచు దస్తగిరి, మాజీ సర్పంచులు గంగయ్య, డాక్టర్ మాబు, జేకే, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, చంద్రయ్య, జయరామిరెడ్డి, కొండారెడ్డి, బాలిరెడ్డి, బాలకృష్ణ యాదవ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో జాతీయ చేనేత దినోత్సవం

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవం విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ యూనిట్ -9 ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ చేనేత దినోత్సవంలో భాగంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి నేతన్నల కష్టాలను గుర్తుచేశారు. బ్రిటిష్ కాలంలో విదేశీ వస్త్రాలను బహిష్కరించి స్వదేశీ వస్త్రాలను ధరించాలని గాంధీజీ పిలుపునిచ్చారని తెలిపారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించాలని, నేతన్నలకు గిట్టుబాటు ధరతో పాటు స్వదేశీ వస్త్రాలను ధరించి ఆదరించాలని సూచించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ -9 వలంటీర్లు సాంప్రదాయ దుస్తులు ధరించి రాంప్ మీద నడిచి చేనేతవర్గాల గొప్పతనాన్ని తెలియచెప్పారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

• రోడ్డుపై విరిగిపడిన చెట్టు



రహదారిపై అడ్డంగా పడిన భారీ చెట్టు

అట్లూరు : మండల పరిధిలోని కలివికోడి పరిశోధనా కేంద్రం దగ్గర కడప – బద్వేలు ప్రధాన రహదారిపై చెట్టు విరిగిపడడంతో వాహనదారులకు అంతరాయం ఏర్పడింది. మండల పరిధిలోని బుధవారం రాత్రి విస్తారంగా వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో వర్షం దాటికి కలివికోడి పరిశోధనా కేంద్రం దగ్గర ఉన్న ఓ చెట్టు ప్రధాన రహదారిపై అడ్డంగా పడింది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో స్థానికులు రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించారు.

• కుంట కాదు.. రహదారే!



అట్లూరు పునరావాస కాలనీ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

అట్లూరు : అట్లూరు క్రాస్‌రోడ్డు పునరావాస కాలనీ దగ్గర కడప – బద్వేలు ప్రధాన రహదారిపై మోకాటి లోతు నీరు నిల్వ చేరి కుంటను తలపిస్తోంది. బుధవారం రాత్రి ఓ పదునుపాటి వర్షం కురిసింది. దీంతో రహదారిపై మోకాల్లోతు మేర నీరు నిలిచింది. దీంతో ద్విచక్ర వాహనదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కార్లు, బస్సులు, లారీలు వెళ్లే సమయంలో పాదచారులు ఎక్కడ బురద నీరు పడుతుందో అని పక్కకు వెళ్లవలసిన దుస్థితి నెలకొంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు, వాహనదారులు అధికారులను కోరుతున్నారు.

ఊర్లకు వెళుతున్నారా.. సమాచారం ఇవ్వండి

మైదుకూరు : మైదుకూరు పట్టణం, మండలంలోని గ్రామాల్లో ఎవరైనా ఊర్లకు వెళుతున్నట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అర్బన్ సీఐ కె.రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వరుస సెలవులు ఉండటంతో ఎవరైనా ఊర్లకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నట్లయితే తమకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. దొంగతనాలు జరగకుండా నివారించేందుకు చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. ఊర్లకు వెళ్లే వారు ఇంట్లో విలువైన వస్తువులను ఉంచుకోరాదని అన్నారు. మోటార్ బైక్‌లకు తప్పనిసరిగా సైడ్ లాక్ వేసుకోవాలని సూచించారు. దొంగతనాల నివారణలో ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు.

లింకు డాక్యుమెంట్ పోయినది
వై.యస్.ఆర్.కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌటుపల్లె గ్రామ పంచాయితీ, గురుదాత్రీ నగర్ కు చెందిన బొమ్మనబోయిన నాగభూషణం, తండ్రి బి. సుబ్బన్న గారి ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ నెం:2151/2012 చాపాడు బస్టాండ్ దగ్గర పోయినది. దొరికిన వారు క్రింది నెంబర్ కు తెలుపగలరు
CELL: 9440107819

హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్స్ విద్యార్థుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని పీఎస్ఎఫ్, ఏఐబీఎస్ఎస్, ఏఎస్‌వైఎఫ్ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర్ నాయుడును కలెక్టరేట్‌లో కలిసి వారు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొడవంటి నాగరాజు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వార్డెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. చాలా వసతి గృహాలు చిన్నపాటి వర్షానికి కూడా ఉరుస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా స్టూడెంట్ సంఘ్ కడప జిల్లా అధ్యక్షులు రమావత్ జగన్ రాథోడ్, అంబేద్కర్ స్టూడెంట్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఓబయ్య పాల్గొన్నారు.

